నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# సిద్దిపేట

శనివారం 2 డిసెంబర్ 2023
SATURDAY, DECEMBER 2, 2023 | SIDDIPET | పేజీలు PAGES : 8



గురువారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

8

# ఆమెదే పైచేయి

## అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌లో మహిళలదే ఆధిక్యం

- 4,80,163 మహిళా ఓటర్లకు 3,95,816 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు..
- సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్‌లో మహిళలదే హవా
- గజ్వేల్‌లో పురుషుల ఓటింగ్ శాతం ఎక్కువ
- జిల్లాలో 4,68,420 మంది పురుష ఓటర్లు..
- ఓటు హక్కు వినియోగించుకున్నది 3,92,014



**శాసనసభ ఎన్నికల పోలింగ్** ముగిసింది. ఏ గ్రామంలో ఓటింగ్ సరళిని చూసినా మహిళా ఓటర్ల చైతన్యమే ఎక్కువగా కనిపించింది. జిల్లాలో మొత్తం 9,48,664 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,68,420, మహిళలు 4,80,163, ఇతరులు 81 మంది ఉన్నారు. 4,80,163 మంది మహిళా ఓటర్లకు 3,95,816 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో మహిళలు, గజ్వేల్ నియోజకవర్గంలో పురుషులు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో మూడింట మహిళల ఓటింగ్ శాతం అధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం నుంచే మహిళలు ఎక్కువగా ఓటు వేశారు. *– సిద్దిపేట(నమస్తే తెలంగాణ ప్రతినిధి), డిసెంబర్ 1*




జనగామలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

8

# బీఆర్‌ఎస్‌దే గెలుపు

## జనగామలో గులాబీజెండా ఎగరడం ఖాయం

**జనగామలో గులాబీ జెండా ఎగరడం** ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ జనగామ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, జడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ రోజు కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు దౌర్జన్యంతో గులాబీ గెలుపును అడ్డుకోవాలని ప్రయత్నించారన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై భౌతిక దాడులకు పూనుకున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘానికి సైతం ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. చాలా గౌరవప్రదంగా బీఆర్‌ఎస్ గెలవబోతుందని, ఇందులో ఎవరికీ అనుమానం లేదన్నారు. బీఆర్‌ఎస్ గెలుపు తథ్యమని తనకు నమ్మకం, విశ్వాసం ఉందన్నారు.
–జనగామ, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ)

- నాకు నమ్మకం, విశ్వాసం ఉంది
- గౌరవప్రదంగా గెలువబోతున్నాం.. అనుమానమే లేదు
- కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం దౌర్జన్యం
- భౌతిక దాడులపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు
- విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య, జనగామ జడ్పీచైర్మన్ సంపత్‌రెడ్డి

# రేపు ఓట్ల లెక్కింపు

**సిద్దిపేట ఇందూర్ కళాశాలలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్**

**ఓట్ల లెక్కింపు ఆదివారం** చేపట్టనున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగనున్నది. గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భారీ బందోబస్తుతో సిద్దిపేట కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపర్చారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత, నాలుగు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జనరల్ అబ్జర్వర్లు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను సీజ్ చేశారు. ఈ మేరకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు సీపీ శ్వేత తెలిపారు.
– సిద్దిపేట(నమస్తే తెలంగాణ ప్రతినిధి), డిసెంబర్ 1



8



సిద్దిపేటలో స్ట్రాంగ్ రూమ్ వద్ద ఈవీఎంల తరలింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత



- కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలు భద్రం
- స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు
- పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన సిద్దిపేట సీపీ శ్వేత




అబ్జర్వర్ల సమక్షంలో సిద్దిపేట నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ను సీజ్ చేస్తున్న అధికారులు